క్లుప్తంగా

రాబోయే రోజులు మనవే


జగన్‌మోహన్‌రెడ్డితో సుధీర్‌రెడ్డి

చిట్టమూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో యువత కష్టపడి పనిచేయాలని రాబోయే రోజులు మనవేనని మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలో యువతకు అండగా ఉండి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి ఇంటికి తెలియజేయాలని సూచించారన్నారు. అధికారంలోకి రాగా నే యువతకు మంచి భవిష్యత్ కల్పిస్తామని అధినేతల హామీ ఇచ్చారన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దక్కిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

చిట్టమూరు: మండలంలోని ఆరూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు పాఠశాల ఆవరణలో, గ్రామంలోని వీధుల్లో మొక్కలు నాటారు. పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న జడ చలపతి తన జన్మదిన వేడుకలను మంగళవారం పాఠశాల విద్యార్థులతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు భోజనం పేట్లు, గ్లాసులను ఆయన వితరణగా ఇచ్చారు. హెచ్ఎం జేవీ లక్ష్మి, టీచర్లు అన్నపూర్ణ, మీరయ్య, మైథిలి, అశోక్, రాజేంద్ర, పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వాకాడు: బాలిరెడ్డిపాళెం, గంగన్నపాళెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప ఎడగారు వరి సాగులో సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, మెళకువలను రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సైదాపురం: డెంగీ వ్యాధిని నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని మండల వైద్యాధికారి జనార్దన్ అన్నారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి, సీహెచ్ఓ సారకాయల చిట్టి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాల అడ్డగింత


వాహనాలను అడ్డుకుంటున్న మైనింగ్ అధికారులు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో ఇటీవల అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో మంగళవారం మైనింగ్ అధికారులు దాడి చేసి రెండు టిప్పర్లు, ప్రొక్లైనర్‌ను సీజ్ చేశారు. ఈసందర్భంగా మైనింగ్ అధికారిణి ఆర్ఐ స్వాతి సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. తెలుగుగంగ మట్టిని సోమవారం తరలిస్తున్న నేపథ్యంలో ఇరిగేషన్ డీఈ సురేష్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. దీంతో కలువాయికి వచ్చిన మైనింగ్ అధికారులు కలువాయి రిజర్వుడ్ ఫారెస్టులో అక్రమంగా మట్టిని తవ్వుతున్న వాహనాలను సీజ్ చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కోట: ఆత్మహత్యకు యత్నించిన కేసవరం గ్రామానికి చెందిన సునీల్(27) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. కుటుంబ సమస్యలు, ఉద్యోగం రాలేదనే బాధతో రెండురోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం వేలూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

రాపూరు: మండల కేంద్రంలోని లక్ష్మీపురంలో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు బండి పెద్ద అంకయ్య(70) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు స్థానికులు గుర్తించారు. ఆయన్ను ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

మెడికల్ కిట్ల పంపిణీ



పెళ్లకూరు: స్థానిక చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ సీఈఓ సీతారామయ్య, ట్రస్ట్ ఏఓ కృష్ణ పాల్గొన్నారు.

డ్రైనేజీలు అధ్వాన్నం

- నాయుడుపేటలో మరమ్మతులకు నోచుకోని మురుగుకాలువలు
- ప్రమాదాలకు తావిస్తున్నా పట్టించుకోని అధికారులు

నాయుడుపేటటౌన్: జిల్లాలో అత్యధిక ఆదాయం కలిగిన మున్సిపాలిటీల్లో మూడవ స్థానంలో నాయుడుపేట ఉంది. ఏడాదికి రూ.10 కోట్లకుపైగా నిధులు సమకూరుతుంటాయి. అంతేకాకుండా సబ్‌ప్లాన్ నిధులతోపాటు పలు ప్రత్యేక గ్రాంటులు సైతం రూ.కోట్లల్లో నిధులు మంజూరవుతున్నాయి. అయితే నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా నిధులను ఖర్చు పెడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో డ్రైనేజీ కాలువల దుస్థితి దారుణంగా ఉంది. పట్టణంలో ప్రధాన డ్రైనేజీ కాలువల్లో రూ.లక్షల నిధులు ఖర్చు పెట్టి పూడిక తీత పనులు తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో డ్రైనేజీ కాలువల్లో ఎక్కడి మురుగు అక్కడే అన్న చందంగా నిలిచిపోతోంది. చిన్నపాటి వర్షం కురిసినా పట్టణంలోని అనేక రహదారులు డ్రైనేజీ మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. పట్టణంలో పాత ట్రెజరీ వీధి, పిచ్చిరెడ్డితోపు వీధి, అగ్రహారపేట, బేరిపేటలోని పలు వీధులు, కలగూరపేట, ఎస్ఎస్ఆర్ కాలనీ, శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు దారుణంగా ఉన్నాయి.

మరమ్మతులకు నోచుకోని డ్రైనేజీ కాలువలు

పట్టణంలో పాతబస్టాండ్ అన్నా క్యాంటీన్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ఉన్న ప్రధాన డ్రైనేజీ కాలువ ప్రమాదకరంగా ఉన్నా అధికారులు, పాలక వర్గం స్పందింకపోవడంపై స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో ఇక్కడ ప్రధాన డ్రైనేజీ కాలువలో పూడిక తీత పనులు చేశారు. డ్రైనేజీ కాలువపై బండలను జేసీబీతో పెకలించడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఏళ్ల తరబడి కాలువపై బండల వేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ డ్రైనేజీ కాలువముందు మున్సిపాలిటీకి చెందిన దుకాణాల సముదాయం ఉంది. దీంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు ప్రమాదకర డ్రైనేజీని దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెలకు వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తున్నా దుకాణాలు ముందు ప్రమాదకరంగా డ్రైనేజీ కాలువ నిర్మాణ చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల తీరుపై దుకాణాదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రధాన డ్రైనేజీ కాలువ దుస్థితిపై స్పందించి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ప్రధాన డ్రైనేజీ కాలువ



ప్రధాన డ్రైనేజి కాలువపై భారీ గుంత, ప్రధాన డ్రైనేజీ కాలువలో పడిన వాహనదారుడు (ఫైల్)

డ్రైనేజీని పట్టించుకోకపోవడం దారుణం

మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాల ముందు ఉండే ప్రధాన డ్రైనేజీ కాలువ ఏళ్ల తరబడి దుస్థితి ఉంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఇక్కడి కాలువ దాటి విక్రయదారులు రాలేని పరిస్థితిలో వ్యాపారాలు జరగక నష్టపోతున్నాం.అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కాలువలను పటిష్టంగా నిర్మాణం చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలి. – షేక్ గౌస్‌బాషా, మున్సిపల్ దుకాణ లీజుదారుడు, నాయుడుపేట

మరమ్మతులు చేపడతాం



పాత బస్టాండ్ సమీపంలో ప్రధాన డ్రైనేజీ కాలువ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. ఇందుకుగాను పాలక వర్గం కూడా ప్రతిపాదనలు చేసింది. డ్రైనేజీ కాలువపై మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చేస్తాం. – షేక్ ఫజులుల్లా, కమిషనర్, నాయుడుపేట

మర్యాదపూర్వక కలయిక


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నాగార్జున

నాయుడుపేటటౌన్: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సూళ్లూరుపేట నియోజవర్గ యువజన విభాగ కన్వీనర్ పాలేటి నాగార్జున మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన యువజన విభాగ రాష్ట్ర స్థాయి సమావేశంలో పాలేటి పాల్గొన్నారు.

కూటమి వ్యతిరేక పాలనను వివరిద్దాం


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు ఏడాది కూటమి ప్రజావ్యతిరేక పాలనపై చంద్రబాబు మ్యానిఫెస్టో రీకాలింగ్ అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వివరించేందుకు సిద్ధం కావాలని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం గూడూరు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అక్రమాలు, దాడులు, అక్రమ కేసులు, ఇలా భయాందోళనలు సృష్టిస్తున్నారని అన్నారు. చంద్రబాబు మ్యానిఫెస్టో రీకాలింగ్ అనే కార్యక్రమాన్ని రూపొందించిందని దీనిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇందుకు గ్రామాల్లో కమిటీలు పటిష్ట పరుచుకుని వారి ద్వారా ప్రతి ఇంటిని సందర్శించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాకాణి గోవర్ధనరెడ్డిని నెల్లూరులో కలిసేందుకు వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆయన రోడ్డు మార్గంలో రావడం ఖాయమన్నారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, కొడవలూరు ధనంజయరెడ్డి, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, యద్దల మధుసూదన్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, నేతలు ఊటుకూరు మహేంద్రరెడ్డి, ఓడూరు బాలక్రిష్ణారెడ్డి, కొండూరు సునీల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి పాల్గొన్నారు.

జగన్ పర్యటనను అడ్డుకోలేరు


మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

నాయుడుపేటటౌన్: ఏవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనను అడ్డుకోలేరని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నెల్లూరు జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులను కలిసి పరామర్శించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరుకు రావడం ఖాయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నెల్లూరులో జరిగే జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో జనాలు సునామీలా తరలివచ్చి కూటమి నేతలకు గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నేతలు తీరు మార్చుకుని హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ వైఎస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, పెళ్లకూరు జెడ్పీటీసీ ప్రీసిల్లా, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, నేతలు మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, కటకం జయరామయ్య, గంధవల్లి సిద్ధయ్య, పార్టీ కన్వీనర్లు అనిల్‌రెడ్డి, పాదర్తి హరినాథ్‌రెడ్డి, అల్లూరు రాహుల్ రెడ్డి, ఆర్ముగం, దారా రవి, షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.

కూటమికి జగన్ ఫోబియా

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: కూటమి నేతలకు జగన్ ఫోబియా పట్టుకుందని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం వాకాడులోని ఆయన నివాసంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నేదురుమల్లి సమావేశమయ్యారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలే కాకుండా అదనంగా ఎన్నో పథకాలు అమలు పరిచి ప్రజల గుండెల్లో స్థిరంగా నిలిచారన్నారు. అందువల్లే జగనన్న ఎక్కడికి వచ్చినా ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. అది చూసి ఓర్వలేని కూటమి నేతలు ఆయన రాకను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 3న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించిడానికి నెల్లూరుకు వస్తున్న సందర్భంగా కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. హెలీప్యాడ్ అనుమతికి ప్రభుత్వాన్ని కోరినా ఇవ్వకపోవడం దారుణమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మార్గంలో నెల్లూరుకు వచ్చి తీరతాడని రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో వస్తున్నాడంటేనే కూటమి నేతల గుండెల్లో దడ పుడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు హామీల వరాలు గుప్పించిన చంద్రబాబు నేడు ప్రజల మనస్సుల్లో మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మరోసారి నిలిచారన్నారు. త్వరలోనే రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో అనే కార్యక్రమాన్ని విజయవంతం చేసి కూటమి సర్కారు మోసాలను ప్రజల్లో ఎండగడతామన్నారు. కూటమి నేతల అరాచకాలను ఇక చూస్తూ ఊరుకునేది లేదని, రానున్న రోజుల్లో నాలో మరో రామ్‌కుమార్‌రెడ్డిని చూస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు కె దామోదర్‌రెడ్డి, హిమకుమార్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సంపత్‌రెడ్డి, రాజారెడ్డి, కస్తూర్‌రెడ్డి, నాగూర్ రెడ్డి, మెట్టు శ్రీహరిరెడ్డి, తూపిలి మధురెడ్డి, జనార్దన్‌రెడ్డి, నలగామల మధురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటయ్య, రవి, పెంచలరెడ్డి, శేషురెడ్డి పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి


స్క్రీనింగ్ శిబిరంలో వైద్యులు, సిబ్బంది

వెంకటగిరి రూరల్: టీటీడీకి చెందిన తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యశాఖ సహకారంతో మండలంలోని పింక్ బస్సుల ద్వారా అందిస్తున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బంగారుపేట పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివకృష్ణారెడ్డి తెలిపారు. పాపమాంబపురం, చింతగుంట గ్రామాల్లో మంగళవారం మొబైల్ స్క్రీనింగ్ వైద్య సేవలను ప్రారంభించారు. డాక్టర్ శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా పింక్ బస్సుల ద్వారా నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారన్నారు. 3వ తేదీన జంగాలపల్లి, పారవోలు, 4వ తేదీన పాళెంకోట, సోమసానిగుంట గ్రామాల్లో వైద్యపరీక్షలు కొనసాగించనున్నట్లు తెలియజేశారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జీనీత, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు హరిత, పద్మావతి, సర్పంచ్‌లు మస్తాన్, నరేష్, చెంచు ప్రసన్నకుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, లక్ష్మి, స్థానిక వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

గూడూరురూరల్: తిరుపతిలోని ఇందిరా మైదానంలో ఈనెల 6న ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్–పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి, అంబేడ్కర్–పూలే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరసా వెంకటరత్నం కోరారు. గూడూరు పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో ఏర్పాటై ఉన్న పూలే దంపతుల విగ్రహం వద్ద మంగళవారం నియోజకవర్గ అధ్యక్షుడు తల్లం ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం పూలే దంపతుల విగ్రహాలకు, టవర్‌క్లాక్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ ఆల్మన్ రాజ్, జానపద కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్, ప్రధాన కార్యదర్శి నాగార్జునరావు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవం



దక్కిలి: దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో అవధూత గురకల పోలయ్యస్వామి ఆరాధన మహోత్సవం సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు అత్యంత వైభవంగా ముగిసింది. పోలయ్యస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కోట: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కోట రెవెన్యూ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేసిన అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, కె.నారాయణ, భాస్కర్ క్రిష్ణ, శెట్టి, నజీర్, శేషయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

బాలాయపల్లి(సైదాపురం): వెంగమాంబపురం జూనియర్ కళాశాలలో బాలాయపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ కరుణకుమారి, అధ్యాపకులు భార్గవి, శ్రీలక్ష్మి, విజయమ్మ, సుబ్రమణ్యం, నవీన్, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, మునిప్రసాద్, వైద్యసిబ్బంది రత్నమ్మ, బుజ్జమ్మ, కేవీ రత్నమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్: మండలంలోని మన్నేగుంట ప్రాథమిక పాఠశాలలో ఆయుర్వేద వైద్యులు రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. హెచ్ఎం ఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరామర్శ

నాయుడుపేటటౌన్: పట్టణంలో పలువురిని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం పరామర్శించారు. పట్టణానికి చెందిన మదిరి చిట్టిబాబు పెద్దకుమారుడు మునిరత్నం (36) దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ మృతిచెందిన విషయం తెలిసిందే. మునిరత్నం మృతదేహాన్ని బుధవారం దుబాయ్ నుంచి నాయుడుపేట తీసుకుని రానున్నారు. సంజీవయ్య నాయకులతో కలిసి పట్టణంలోని ముస్లిం వీధిలోని చిట్టిబాబు నివాసం వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా అగ్రహారపేటలో నివాసం ఉంటున్న డీలర్ శేషారెడ్డి మంగళవారం మృతిచెందారు. సంజీవయ్య ఆయన నివాసం వద్దకు వెళ్లి శేషారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

బోటనీ గ్రంథం ఆవిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విక్టోరియా రాణి బోటనీకి సంబంధించి రచించిన గ్రంథాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. విక్టోరియా రాణిని కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వి.రాజా, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం



రాపూరు: మద్దెలమడుగు వద్ద ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి దేవాలయాల నాల్గవ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం 10.30కి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి ,అయ్యప్ప స్వామి, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌లో కొలువుదీర్చి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

క్రీడలతో మంచి గుర్తింపు


క్రీడాపతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం

చిల్లకూరు: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అల్లూరు ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమం ఆరంభంలో స్పోర్ట్స్ క్రీడా పతాకాన్ని ఎల్లసిరి సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ఎగురవేశారు. గూడూరు పట్టణంలోని విద్యార్థులు మీట్‌లో పాల్గొన్నారు. సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రోగ్రాం ఆర్గనైజర్లు దశరథరామిరెడ్డి, మునిగిరీష్, మల్లు విజయకుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సురేంద్రరెడ్డి, కరిముల్లాకాన్, సురేష్‌బాబు, మోహన్ రాజు పాల్గొన్నారు.

తెగచర్లలో చోరీ


తెగచర్లలో జరిగిన చోరీ తీరును పరిశీలిస్తున్న పోలీసులు

రాపూరు: మండలంలోని తెగచర్ల గ్రామంలో నగలు, నగదు చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ వెంకటేశ్వరావు కథనం మేరకు, సోమవారం రాత్రి సుగుణమ్మ బీరువా తాళాలను దిండు కింద ఉంచుకుని నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తాళంతో బీరువాను తెరచి అందులో ఉన్న రూ.2 లక్షల నగదు, 4 సవర్ల బంగారు నగలు తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితరాలు మంగళవారం ఉదయం నిద్రలేచి చూడగా, బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం


మౌలాలీ పంజాను గుర్రం పెట్టుకుని పులి వేషాలతో ఊరేగింపు నిర్వహించిన నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: మొహర్రం పండుగను పురస్కరించుకుని ముస్లింలు, హిందువులు పీర్ల పండుగ వేడుకల్లో పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. పట్టణంలోని గరిడివీధిలోని హజరత్ మౌలాలీ తాలీంఖానా వద్ద మంగళవారం రాత్రి పీర్ల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలాలి తాలీంఖానా యువజన కమిటీ సభ్యులు, మత పెద్దలు గరిడీలో పీర్లు ప్రతిష్ఠించిన చోట ఫాతేహాలు జరిపారు. ముస్లింలు ఇళ్ల నుంచి జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి తాలీంఖానా వద్ద ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి మౌలాలి పంజా (పీర్లు)ను గుర్రంపై ప్రతిష్ఠించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పంజా ఊరేగింపులో పిల్లల పులివేషాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తీన్ మార్ బ్యాండు మేళాలు, డప్పు కళాకారులతో యువత కోలాహలం చేస్తూ పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు.

పునర్జన్మ ప్రసాదించే దేవుళ్లు వైద్యులు


గూడూరులో వైద్యులకు సన్మానం

గూడూరురూరల్: వివిధ రకాల వ్యాధులతో బాధపడే ప్రజలకు పునర్జన ప్రసాదించే దేవుళ్లు వైద్యులేనని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేసే ఏడుగురు ప్రముఖ డాక్టర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, ఆర్ఎంఓ ప్రసన్న, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మౌలా, సంస్థ సభ్యులు మాకాని వెంకటేశ్వరరావు, పెంచలయ్య, నాగరాజు, యశ్వంత్, శ్రీను, కృష్ణారెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

అదేవిధంగా పట్టణంలోని వైద్యురాలు డాక్టర్ రోహిణిని కృపా చారిటబుల్ ట్రస్ట్ ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు, ట్రస్ట్ సభ్యులు మంజిరి గోపాల్, రమణయ్య, సురేంద్రబాబు, రమేష్ పాల్గొన్నారు.